క్లుప్తంగా

నంద్యాల ఎంపీకి సత్కారం



ఎంపీ బైరెడ్డి శబరిని సత్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఎంపీగా ఎన్నికైన బైరెడ్డి శబరిని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి శాఖ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మంగళవారం కర్నూలులోని ఆమె నివాసంలో కలిసి ఉద్యోగులకు తీవ్రంగా నష్టం కలిగించే సీపీఎస్ రద్దు కోసం పార్లమెంటులో వత్తిడి తేవాలని ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి, జవహర్‌లాల్ కోరారు. ఉద్యోగులు ఎదుర్కొనే అన్ని రకాల సమస్యల పరిష్కారానికి అవసరమైన కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, కర్నూలు నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, సాంబశివారెడ్డి, వివిధ తాలుకాల నేతలు మణిశేఖర్‌రెడ్డి, హుస్సేన్‌రెడ్డి, వలి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమస్యలపై వినతి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల, ఇన్‌చార్జ్/అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులను 19 సంవత్సరాల అనుభవం ఉన్న సీనియర్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఎంఐసీ/అసిస్టెంట్ ఇంజినీర్‌లకు పోస్టులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వామనగారి హనుమన్న, జిల్లా అధ్యక్షుడ ఎస్. రాము నాయక్, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, సెక్రటరి కె. వెంకటేష్, కోశాధికారి మధు ఉన్నారు.

నేడు అష్టోత్తర శత కలశ పూజ

కర్నూలు కల్చరల్: ఆషాడమాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. అష్టోత్తర శత కలశ పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజుకు ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం ఆసుపత్రి తనిఖీకి వచ్చిన ఆయనను యూనియన్ నాయకులు కలిసి వారి సమస్యలు విన్నవించారు. ఆసుపత్రిలో ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు, పారా మెడికల్ సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉందని చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు నాయక్, రాష్ట్ర కార్యదర్శి అబ్రహాం, కర్నూలు శాఖ కార్యదర్శి ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, నాయకులు హరిశ్చంద్ర నాయుడు, శేషిరెడ్డి, సుందర్‌రాజు, లోకేష్, ఉరుకుందయ్య, మల్లికార్జున, రమేష్, రంజిత్, రాజు, చెన్నయ్యదాస్, మాలిక్ ఉన్నారు.

కేసీ కెనాల్ శుభ్రత పట్టదా?

కర్నూలు (టౌన్) : నగరంలోని కేసీ కెనాల్ మూసీ నదిని తలపిస్తుందని, వెంటనే శుద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కెనాల్ మురుగు నీటిలో ఆ పార్టీ నాయకులు దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనాల్ మొత్తం డ్రైనేజీ నీటితో నిండిపోయిందన్నారు. దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నగరపాలక కమిషనర్‌కు పట్టడం లేదన్నారు. పాలకులు కెనాల్‌లో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మహేష్, శ్రీనివాసరావు, సురేంద్ర, క్రిష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాలపై అవగాహన



డీఆర్వోతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జీలు

కర్నూలు(సెంట్రల్): జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపికైన లీల సాయిసుభాష్, పీజే తేజ, ఎ. వెంకటసాయి, ఎం.ఈశ్వర్ వెంకట ప్రసాదు, కట్ట హేమలకు రెవెన్యూ చట్టాలు, అంశాలపై డీఆర్వో కె.మధుసూదన్‌రావు మంగళవారం అవగాహన కల్పించారు.మొదటగా వారు డీఆర్వోను ఆయన చాంబరులో కలిశారు. అనంతరం గోకులం సమావేశ భవనంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు రోజంతా రెవెన్యూలోని అడంగల్, సర్వే నంబర్లు, 1బీ, ఇతర అంశాలై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎం. శేషిరెడ్డి పాల్గొన్నారు.

ఆటాపాట.. అమ్మానాన్న మాట

చదువు.. మార్కులు...ర్యాంకులు.. పిల్లల ఎడ్యుకేషన్‌పై ఒకప్పుడు తల్లిదండ్రుల ఆలోచన. ఇప్పుడు వారి ఆలోచన విధానంలో మార్పు వచ్చింది. ఈ పోటీ ప్రపంచంలో చదువే భవిష్యత్ కాదని బాగా ఆడి పాడితే కూడా కెరీర్ ఉంటుందని తెలుసుకుంటున్నారు. దీంతో తమ పిల్లలకు ఇష్టమైన రంగాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఆ దిశగా అవసరమైన ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు.

– కర్నూలు కల్చరల్

- పిల్లల కెరీర్‌పై తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మార్పు
- చదువుతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యం
- ఇష్టమైన రంగంలో పాల్గొనేలా ప్రోత్సాహం
- ఇతర విద్యార్థులతో పోలిస్తే క్రీడాకారుల జీవితాల్లో సక్సెస్ రేట్ ఎక్కువ
- ఆటలతో ఆరోగ్యంతో పాటు పెరగనున్న కమ్యూనికేషన్ స్కిల్స్



వయోలిన్ నేర్చుకుంటున్న బాలబాలికలు



నృత్య శిక్షణ పొందుతున్న అమ్మాయిలు

జీవితంలో చదువు ఒక భాగం. అక్షర జ్ఞానం, విషయవగాహనకు ఇది అవసరం. కొందరు చదువు ద్వారానే ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడుతారు. మరికొందరు క్రీడాకారులుగా, డ్యాన్సర్లుగా, మ్యుజిషియన్లుగా, ఆర్టిస్టులుగా ఎదిగి అలా వారికి ఇష్టమైన రంగంలో స్థిరపడి లైఫ్‌ను లీడ్ చేస్తున్నారు. సహ పాఠ్యాంశాల్లో పాల్గొనే విద్యార్థులు మిగతా విద్యార్థుల కన్నా భిన్నంగా ఉంటారు. కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉండటం .. పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించడం.. ఒత్తిడిని జయించడంతో తమ గెలుపునకు ఉజ్వల బాటలు వేసుకుంటున్నారు.

చదువుతో పాటు.. ఇష్టమైన రంగాలు

విద్యార్థి దశ నుంచే పిల్లలకు చదువుతో పాటు క్రికెట్, టెన్నిస్, స్విమ్మింగ్, షూటింగ్, బాడ్మింటన్, హాకీ, వాలీ బాల్, హ్యాండ్ బాల్ లాంటి స్పోర్ట్స్‌తో పాటు డ్యాన్స్, సంగీతం, మృదంగం, నాదస్వరం, వయోలిన్, హార్మోనియం, లాంటి అంశాల్లో ఇష్టమైన ఏదో ఒకటి తప్పని సరిగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల, కళాశాల చదువుతో పాటు వీటికి సమయం కేటాయించుకునే ప్లాన్ చేయిస్తున్నారు. లేదంటే ఇదివరకు స్కూలు నుంచి ఇంటికి వస్తేనే టీవీలకు హత్తుకుపోవడమో. సెల్‌ఫోన్ చేతపట్టుకోవడం చేసేవారు.

ఆటలతో ఆరోగ్యం.. ఆనందం..

ప్రస్తుత జీవన విధానంలో వచ్చిన మార్పులతో చదువుతో పాటు స్పోర్ట్స్, డ్యాన్స్, సంగీతం లాంటి వాటిని కెరీర్‌గా తీసుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. మరికొందరు ఏకంగా స్పోర్ట్స్‌ను కెరీర్‌గా తీసుకుని, చదువుకు ఆ తర్వాతి స్థానం ఇస్తున్నారంటే ఆటలపై ఏస్థాయి మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యా సంస్థలు పెరిగినట్లే స్పోర్ట్స్ అకాడమీలు, డ్యాన్స్ అకాడమీలు, మ్యూజిక్ ఇనిస్టిట్యూషన్ల సంఖ్య పెరుగుతోంది. క్రీడలు, డ్యాన్స్, సంగీతం లాంటి వాటిల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. ఆనందంగా గడుపుతారు. ఇతర అంశాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉంటాయి. వీరిలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటాయి. డైట్ కంట్రోల్ ఉంటుంది. సహ పాఠ్యాంశాల్లో శిక్షణ పొందిన వారు ఇతర విద్యార్థుల కంటే జీవితంలో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ అధ్యయన సంస్థలు సైతం పేర్కొంటున్నాయి.

క్రీడల్లో ప్రతిభావంతులకు ప్రత్యేక కోటా

క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి ప్రభుత్వం ఉన్నతాధికారులుగా పోస్టింగ్ ఇచ్చి గౌరవిస్తుంది. స్పోర్ట్స్‌లో సత్తాచాటి సర్టిఫికెట్ సాధిస్తే ఎంబీబీఎస్, ఇంజినీరింగ్‌తో పాటు అన్ని ప్రొఫెషనల్ కోర్సుల అడ్మిషన్లలో 0.5 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిట్ సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ మూడు సంవత్సరాలు, ఉద్యోగానికి రిజర్వేషన్ ఏడు సంవత్సరాల వరకు వర్తిస్తుంది.

ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి



తల్లిదండ్రులుగా పిల్లలకు ఇష్టమైన వాటిలో ప్రోత్సహించాలి. మా అమ్మాయి ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఆమెకు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం 7వ తరగతి నుంచి స్విమ్మింగ్‌కు రెగ్యులర్‌గా పంపుతున్నాం. స్విమ్మింగ్ అసోసియేన్స్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన ఈత పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుంది. చదువులో కూడా రాణిస్తుంది.

– పి.మాధవి, పేరెంట్

క్రీడలంటే చాలా ఇష్టం



నేను మాంటిస్సోరి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నాకు చదువుతో పాటు క్రీడలు చాలా ఇష్టం. తైక్వాండోలో శిక్షణ పొందుతున్నాను. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆగస్టులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. మా తల్లిదండ్రులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల యాజమాన్య సహకారం కూడా లభిస్తుంది. తైక్వాండోలో జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది. – ఎం. హిమనవ్య, విద్యార్థిని

రోప్ స్కిప్పింగ్‌లో మెడల్స్ సాధించా



నేను క్రైడో స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాను. నాకు ఆటలంటే చాలా ఇష్టం. రోప్‌స్కిప్పింగ్‌లో జాతీయ స్థాయిలో రాణించాలనేది నా ధ్యేయం . జిల్లా, రాష్ట స్థాయి పోటీల్లో సత్తా చాటి మెడల్స్ సాధించాను. ఇప్పటికే సౌత్ ఇండియా రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించాను. మా అమ్మనాన్న లక్ష్మి, జనార్ధనుడు తీసుకుంటున్న శ్రద్ధ, పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం ఎంతో ఉంది. – ఎస్.యోగేశ్వరి, విద్యార్థిని

చదువుతో పాటు సంగీతం నేర్చుకుంటున్నా



నేను జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుచున్నాను. అమ్మ నాన్న ఉషారాణి, బసయ్య. నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. నా ఇష్టాన్ని గుర్తించిన మా తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో సంగీతం నేర్చుకుంటున్నాను. నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి అయింది. తరువాత రెండు ఏళ్ల డిప్లమా కోర్సు పూర్తి చేయాలనుకుంటున్నాను. సంగీతం నేర్చుకోవడంతో నా చదువుకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. –కె. నమిత, బీటెక్ స్టూడెంట్

ఒత్తిడి దూరం



నేను విశ్వ భారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. చదువుతో పాటు నాకు కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. మా అమ్మ నాన్న జ్యోతి, సుబ్బయ్య ప్రోత్సాహంతో 2009 నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో రెండేళ్ల డిప్లొమా కోర్సు చేస్తున్నాను. చదవుతో ఒత్తిడికి గురవుతుంటాం. రోజులో కొంత సేపు నృత్య సాధన చేస్తే అన్నీ మర్చిపోయి ప్రశాంతత పొందుతాం.

– బి.కృష్ణ దీపిక, ఎంబీబీఎస్ స్టూడెంట్

ఎయిమ్స్ తరహాలో పెద్దాసుపత్రి అభివృద్ధి



కార్డియోథొరాసిక్ విభాగంలో రోగి గురించి ఎంపీకి వివరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామని, ఆసుపత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వైద్యం అందిస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డితో పలు విషయాలు చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలను అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ ఉన్నారు.

నేడు ఏపీ హంస సిటీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ హంస సంఘం సిటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీన సాయంత్రం 3 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నగర అధ్యక్షుడు టి. గోవిందు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఆరవ పాల్ హాజరవుతారన్నారు. సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సంఘం నాయకులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

విష్ణు టౌన్ షిప్‌లో మౌలిక సదుపాయాలు కల్పించండి

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలోని విష్ణు టౌన్ షిప్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరారు. మంగళవారం కాలనీకి చెందిన గోపాల్, సత్యనారాయణ, హర్ష తదితరులు అధికారుల తీరుపై నిరసన తెలిపారు. కాలనీలో తాము 18 సంవత్సరాలుగా నివసిస్తున్నామని, రోడ్లు, తాగునీటి సరఫరా సరిగా లేదన్నారు. కాలనీ వాసుల నిరసనను తెలుసుకున్న మున్సిపల్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు, లైన్‌మెన్ ఆప్సర్ అక్కడికి చేరుకొని తాగునీటి సమస్యకు సంబంధించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అమ్మవారికి పూజలు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం మంగళవారాన్ని పురస్కరించుకొని కర్నూలు ఓల్డ్‌సిటీలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిత్తారి వీధి, కుమ్మరి వీధి, కంసలి వీధి, మరాఠ వీధి, మంగళిగేరి, నటరాజ వీధి, రంగ రాజు వీధిల్లోని భక్తులు మేళతాళాలతో ఆధ్యాత్మిక నృత్యాలు చేస్తూ బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. బండిమెట్ట గంగా భవానీ ఆలయం, మేడవారి సత్రం సమీపంలోని సుంకులమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీలు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణాలకు హెల్మెట్ రక్ష



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల్లో అది ప్రాణాలకు రక్షణ కల్పిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్ అన్నారు. మంగళవారం వారు జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ, హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల చట్టం, దాని కింద రూపొందించిన నియమాలు, నిబంధనలు, హెల్మెట్ వాడకం ఆవశ్యకత తదితర వాటి గురించి విద్యార్థులకు, ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బందికి షార్ట్ ఫిల్మ్ వేసి అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.మురళీధర్‌రెడ్డి, జిల్లా రవాణా కమిషనర్ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ గౌతమి, ఆర్‌టీఓ రమేష్, తాలూకా సీఐ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

కర్నూలు (టౌన్) : కల్లూరు వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పాణ్యం అర్బన్ పరిధిలోని 16 వార్డులకు సంబంధించి మున్సిపల్ అధికారులు, ఇంజినీర్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. కల్లూరు వార్డుల్లో తాగునీటికి సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఉల్చాల రోడ్డులోని రాఘవేంద్రనగర్‌లో 6 రోజులుగా మంచినీటి సరఫరా లేదని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. తాగునీటి వేళలు సైతం ప్రజలకు పూర్తిగా ఇబ్బందిగా ఉందన్నారు. వేళలను మార్చడంతో పాటు రెండు రోజులకు ఒకసారి వచ్చే మున్సిపల్ వాటర్‌ను కనీసం గంట పాటు వదలాలని సూచించారు. కల్లూరు శివారు కాలనీల్లో రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈలు షాకీర్ హుస్సేన్, ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ ప్రగతికి బాట

కల్లూరు: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట వేస్తుందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మాధవీనగర్‌లోని కార్యాలయంలో మాట్లాడుతూ ఉచిత ఇసుక ద్వారా పేదల సొంతిటి కల నెరవేరుతుందన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక భవన్‌లో రెండో రోజూ సీపీఎం నాయకుల విస్తృత సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో జనాభా విపరీతంగా పెరుగుతుండడంతో ట్రాఫిక్ నియంత్రణ కష్టసాధ్యమైందన్నారు.ఫలితంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు. నాయకులు ఆర్.నరసింహులు, కేవీ నారాయణ, పి.నిర్మల, టి.రాముడు పాల్గొన్నారు.

వీసీలను నియమించాలి

కర్నూలు(సెంట్రల్) : రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీల్లో పనిచేస్తున్న వీసీలను తొలగించిన టీడీపీ ప్రభుత్వం..వెంటనే వారి స్థానంలో నూతనంగా వీసీలను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అభివృద్ధిని గాడిలో పెడతాం

కర్నూలు(హాస్పిటల్): ఐదేళ్లుగా కుంటుపడిన అభివృద్ధిని మళ్లీ గాడిలో పెడతామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. డోన్‌లో జరిగిన ఘర్షణలో గాయపడిన మద్దయ్య అనే వ్యక్తిని మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆయన పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి గురించి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డితో చర్చించి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. విలువైన ఇసుకను తాము ప్రజలు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. డోన్‌లో మైనింగ్, హార్టికల్చర్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. వేదవతి నది ద్వారా తాగు, సాగునీరు అందిస్తామన్నారు. అలాగే కుంటుపడిన రైల్వే వ్యాగన్ పనులను త్వరగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కోట్ల తెలిపారు. డోన్ భూ ఆక్రమణలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు :ఎవరైనాశాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కొత్త చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్‌తో కలిసి కర్నూలు మండలం రుద్రవరం గ్రామంలో డీఎస్పీ విజయశేఖర్ పర్యటించారు. అనంతరం రచ్చకట్ట వద్ద గ్రామ పెద్దలతో కలిసి ప్రజలతో సమావేశమై శాంతిభద్రతల పరిస్థితులపై చర్చించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో కలసిమెలసి జరుపుకోవాలని, ఎవరు కూడా ఆవేశానికి లోనై గొడవలకు తావు ఇవ్వకూడదని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలి తప్ప వ్యక్తిగతంగా కక్షలు పెంచుకుని గొడవలు పడటం చట్ట విరుద్ధమన్నారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల గురించి ఏమైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని సూచించారు.

కర్నూలులోనే కాలేయ మార్పిడి శస్త్రచికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చందన్‌కుమార్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ఆర్క హాస్పిటల్‌లో త్వరలోనే కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభిస్తామని లివర్ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డాక్టర్ చందన్ కుమార్, ఆర్క హాస్పిటల్ ఎండీ డాక్టర్ శశివర్ధన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని ఆర్క హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు కాలేయ మార్పిడి ఆపరేషన్‌కు హైదరాబాద్, బెంగళూరు వెళ్లేవారని, ఇకపై ఆ అవసరం లేకుండా కర్నూలులోని ఆర్క హాస్పిటల్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మరో ఏడాదిలోగా దీనిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి కాలేయ మార్పిడి క్లినిక్‌ను ప్రారంభించామన్నారు. నెలలో రెండుసార్లు హైదరాబాద్‌లోని గ్లెనీగల్స్ హాస్పిటల్స్ వైద్యులు ఇక్కడికి వచ్చి క్లినిక్‌లో రోగులను చూస్తారన్నారు. రాయలసీమ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ఈ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఆల్కహాలు వల్ల 50 శాతం, ఫ్యాటీ లివర్‌తో 40 శాతం, హెపటైటిస్ వల్ల 10 శాతం మందికి కాలేయం దెబ్బతింటోందని, భవిష్యత్‌లో ఫ్యాటీలివర్ వల్ల ఇబ్బంది పడే వారే ఎక్కువ అవుతారన్నారు. సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ రితేష్‌రెడ్డి, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమలారెడ్డి, సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రణాళికలు రచించండి

- తాగునీరు, రోడ్ల విస్తరణ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి
- నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షలో మంత్రి టీజీ



మునిసిపల్ అధికారులతో కర్నూలు నగరాభివృద్ధిపై సమీక్షిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో నగర పాలకసంస్థ అధికారులతో నగరాభివృద్ధి పై సమీక్షించారు. ముందుగా నగరంలో అభివృద్ధికి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, వాటి స్థితిగతులు, జూన్ 18వ తేదీన సమీక్షించిన అంశాలపై కమిషన్ భార్గవ్‌తేజ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అమృత్-2 పథకానికి సంబంధించి మంజూరై నిలిచిపోయిన జగన్నాథగట్టు మీద రూ.130 కోట్లతో 50 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం, 21 ఈఎస్ఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణం, తుంగభద్రనది ఒడ్డున రూ.122 కోట్లతో చేపడుతున్న 35 ఎంఎల్‌డీ మురుగు శుద్ధి కేంద్ర నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగర ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరా సాధ్యమైనంత వరకు రాత్రి వేళల్లో కాకుండా పగటి పూటే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు .కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించాలని, రోడ్డు విస్తరణలో ఇండ్లు, షాపులు కోల్పేయే బాధితులతో మాట్లాడి తగిన పరిహారం తీసుకునేందుకు ఒప్పించాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు వద్ద ఎస్ఏపీ క్యాంపులో నుంచి బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిలోకి ప్రవేశించేలా రెండో పటాలం అధికారులతో మాట్లాడాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుద్ధ్య మెరుగుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న సందుల్లో కూడా హైపో ద్రావణాన్ని పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు నగరం, చుట్టు పక్కల ఉన్న వక్ఫ్ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖపై అధికారులతో సమీక్షించారు. చర్చిలు, మసీదులు, షాదీఖానాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు, విడుదలైన నిధులపై నాలుగో రోజుల్లో తనకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం కింద మంజూరైన ఐదు పథకాలకు భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌ఖన్నా, ఏపీఈఐడబ్ల్యూఐడీసీ శాఖాధికారులు పాల్గొన్నారు.